## మంచి వార్త



# ఆట మైదానంలో మాట కచేరీ

**రాజస్థాన్,** జోధ్‌పూర్ జిల్లాలోని మారుమూల గ్రామం చుతర్‌పురా. దేవేంద్రకుమార్ అనే యువకుడి సొంతూరు అది. పదకొండేండ్ల వయసులో అతను తొలి సారిగా రేడియోలో క్రికెట్ ఇంగ్లిష్ వ్యాఖ్యానం విన్నాడు. మిగతా పిల్లలైతే అసలు వ్యాఖ్యానాన్ని పక్కనపెట్టి.. జట్టు స్కోర్, అభిమాన ఆటగాళ్ల పరుగులు, రికార్డుల మీద దృష్టిపెడతారు. కానీ, దేవేంద్రను మాత్రం ఆ మాట కచేరీ చాలా ఆకట్టుకుంది. ఆరు నూరైనా క్రికెట్ వ్యాఖ్యాత కావాలని నిర్ణయించుకున్నాడు. రేడియో సాయంతోనే ఇంగ్లిష్ పాఠాలు నేర్చుకుంటూ సర్టిఫైడ్ క్రికెట్ వ్యాఖ్యాత స్థాయికి చేరాడు. ఇప్పుడు అతని వయసు 36 ఏండ్లు. దేవేంద్ర వాక్ ప్రవాహం ముచ్చటగా ఉంటుంది. ఆ వ్యాఖ్యానంలో పంచ్‌లు ప్రవహిస్తుంటాయి. తాజా ప్రపంచకప్‌లో.. భారత్, అఫ్ఘానిస్తాన్ మ్యాచ్ సందర్భంగా బీబీసీ రేడియో కోసం దేవేంద్రకుమార్ తొలిసారిగా మైక్రోఫోన్ చేతికి అందుకున్నాడు. తర్వాత అఫ్ఘానిస్తాన్, ఇంగ్లండ్ మ్యాచ్‌కూ వ్యాఖ్యాతగా వ్యవహరించాడు. ఈ మ్యాచ్‌లో క్రికెట్ పసికూన అఫ్ఘానిస్తాన్ చేతిలో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ ఓడిపోవడం గమనార్హం. కాగా, క్రికెట్ వ్యాఖ్యాతగా రూపొందడానికి దేవేంద్ర జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో స్థానిక పోటీల్లో సాధన మొదలుపెట్టాడు. 2017లో అఫ్ఘానిస్తాన్, ఐర్లాండ్ మధ్య జరిగిన 3 వన్డేలకూ వ్యాఖ్యానం చేశాడు. 'ఈ క్షణం నాకెంతో ఆనందంగా ఉంది. క్రికెట్ వ్యాఖ్యాతగా జీవితం మొదలుపెట్టాను. నాదైన వృత్తి ఏదైనా ఉంటే... అది ఇదే అని బలంగా నమ్ముతాను' అంటూ దేవేంద్ర కుమార్ ఉప్పొంగిపోతాడు. కామెంట్రీలో రమీజ్ రజా, డానీ మారిసన్ అతని రోల్‌మాడల్స్. అయితే, స్ఫూర్తినిచ్చిన సంఘటన మాత్రం 1998లో షార్జాలో జరిగిన భారత్, ఆస్ట్రేలియా మ్యాచ్ సందర్భంగా టోనీ గ్రేగ్ వ్యాఖ్యానమే. ఆ మ్యాచ్‌లో సచిన్ టెండూల్కర్ సిక్సర్ కొట్టినప్పుడు.. ''ద లిటిల్ ఫెలా హ్యాజ్ హిట్ ద బిగ్ ఫెలా ఫర్ ఎ సిక్స్'' అంటూ టోనీ గ్రేగ్ చమత్కారం చేశారు. ఓ రాజస్థాన్ పల్లెటూరి పిల్లాడు వ్యాఖ్యాతగా పెద్దలతో గొంతుకలపడం ముచ్చట పడాల్సిన సంగతే.

## వైతాళికుల వాణి

వేట తర్వాత,
యుద్ధ సమయంలో,
ఎన్నికల ముందు
అబద్ధాలు ఆడటం
మంచిది కాదు.

- **ఒట్టో వాన్ బిస్మార్క్**
**(జర్మనీ ఏకీకరణ కర్త, రాజనీతివేత్త)**

## క్యా బాత్‌హై!

